క్లుప్తంగా

పూరిల్లు దగ్ధం



ప్రమాదంలో కాలిపోతున్న పూరిల్లు

బొండపల్లి(మెంటాడ): మండలంలోని చల్లపేట గ్రామంలో బుధవారం మధ్యాహ్నం గ్యాస్ లీకై జరిగిన అగ్ని ప్రమాదంలో పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. గ్రామానికి చెందిన తల్లాడ దేవి ఇంట్లో గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపుచేశారు. అయితే అప్పటికే ఇంట్లోని సామగ్రి కాలిపోవడంతో బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. ఈ ప్రమాదంలో రూ.2 లక్షల విలువైన ఆస్తి నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు.

పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్



లబ్ధిదారుకు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందిస్తున్న పాలవలస రాజశేఖరం

రేగిడి: పేదలకు 'సీఎం రిలీఫ్ ఫండ్' అండగా నిలుస్తోందని వైఎస్సార్‌సీపీ కేంద్ర పాలక మండలి సభ్యుడు పాలవలస రాజశేఖరం అన్నారు. పాలకొండలోని ఆయన స్వగృహం వద్ద రేగిడి మండలం పెద్దశిర్లాం గ్రామానికి చెందిన కోట్ల సత్యంనాయుడు భార్య కోట్ల సుకన్యకు రూ.2 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కును బుధవారం అందజేశారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సిఫార్సు మేరకు సీఎంఆర్ఎఫ్ నుంచి సాయం అందిందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పాలవలస రామచంద్రినాయుడు, కోట్ల బంగారినాయుడు, కోట్ల లక్షున్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణకు సహకరించాలి: ఆర్డీఓ



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్డీఓ

బొబ్బిలి: ఓటరు జాబితా సవరణకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని ఆర్డీఓ పి.శేషశైలజ అన్నారు. తన ఛాంబర్‌లో బుధవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణకు ప్రతీ రోజు బూత్ లెవెల్ ఆఫీసర్లకు టార్గెట్లు ఇస్తున్నామని, వారు వాటిని చేరుకునేలా చూసే బాధ్యత రాజకీయ పార్టీల ప్రతినిధులపై ఉందన్నారు.

వెల్‌నెస్ కేంద్రం ప్రారంభం రేపు



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న గొల్లలపేట వెల్‌నెస్ కేంద్రం

రామభద్రపురం: మండలంలోని తారాపురం, గొల్లలపేట సచివాలయాల పరిధిలో నూతనంగా నిర్మించిన వెల్‌నెస్ కేంద్రాలను ఈ నెల 18న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు చేతులమీదుగా ప్రారంభించనున్నట్లు డీఈఈ అప్పారావు బుధవారం తెలిపారు. ఒక్కో భవనం సుమారు రూ.21 లక్షల వ్యయంతో అన్ని సౌకర్యాలతో నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు.

అభివృద్ధి పనులు వేగవంతం

రామభద్రపురం: గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని పంచాయతీరాజ్ డీఈఈ అప్పారావు అన్నారు. స్థానిక మండల పరిషత్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ.. పల్లెలు,పట్టణాలు అనే వ్యత్యాసం లేకుండా ప్రగతి పరుగులు తీస్తోందన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో గ్రామాల్లో రహదారులు, డ్రైనేజీ సమస్యకు మోక్షం లభించినట్లయిందన్నారు. బొబ్బిలి నియోజకవర్గంలో ఇప్పటి వరకు నిర్వహించిన 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో సచివాలయానికి రూ.20 లక్షలు చొప్పున నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని, ఆ నిధులతో అవసరమైన చోట్ల రహదారులు, డ్రైనేజీలు, తదితర నిర్మాణాలను చేపడుతున్నట్లు చెప్పారు.

పోలింగ్‌కు సన్నద్ధం

బాడంగి: మండలంలోని పాల్తేరు 6వ వార్డు మెంబరు స్థానానికి ఈ నెల 19న జరిగే ఉపఎన్నికకు అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నట్లు ఈవోపీఆర్డీ సూర్యనారాయణ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ పోలింగ్ అధికారులు, సిబ్బందికి పోలింగ్ నిర్వహణపై శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. బ్యాలెట్ పేపర్లు ఇప్పటికే చేరుకోగా.. వాటిని స్థానిక పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచినట్లు చెప్పారు. అభ్యర్థుల ఏజెంట్లు ఆర్‌ఓ వద్ద గుర్తింపు కార్డులు తీసుకోవాలన్నారు. 19న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరుగుతుందని, అనంతరం ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడిస్తారన్నారు.

ప్రతీ కుటుంబానికి సంక్షేమ లబ్ధి

● ఎమ్మెల్యే కంబాల జోగులు



రాజాం: బొద్దాంలో చేనేత కార్మికునికి సంక్షేమ పథకాల లబ్ధిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: అర్హత ఉన్న ప్రతీ కుటుంబానికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మండలంలోని బొద్దాం గ్రామంలో బుధవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా అని ఆరాతీశారు. నాలుగున్నరేళ్లలో ఆయా కుటుంబాలకు ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా అందించిన లబ్ధిని వివరించే బుక్‌లెట్లు అందజేశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వివరించారు. ప్రజలంతా సంక్షేమ పథకాలతో ఆర్థికంగా బలోపేతమయ్యారని పేర్కొన్నారు. ప్రతీ ఇంట్లో లబ్ధిదారులు ఉన్నారని వెల్లడించారు. గతంలో ఏ ప్రభుత్వం అమలుచేయనన్ని సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని వివరించారు. గతంలో టీడీపీ ప్రభుత్వం తమ పార్టీ కార్యకర్తలకు మాత్రమే సంక్షేమ పథకాలు అందించేదని, నీరు–చెట్టు పనుల పేరుతో రాష్ట్ర ఖజానా కాజేసిందని ఆరోపించారు. టీడీపీకి మళ్లీ అవకాశం ఇస్తే ఈ సంక్షేమ పథకాలన్నీ కనుమరుగవుతాయని, ఈ పథకాలు ఇలాగే కొనసాగాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాజాం మండల కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, స్థానిక సర్పంచ్ నక్క తవిటమ్మ, వైస్ ఎంపీపీ నక్క వర్షిణి, నక్క శ్రీను, వీవర్స్ సొసైటీ ప్రెసిడెంట్ కనకం శ్రీను, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నక్క సత్యనారాయణ, డైరెక్టర్ నక్క ఉమామహేశ్వరరావు, అలజంగి లక్ష్మణరావు, జినగం సత్యనారాయణ, పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్లు చిన్నంనాయుడు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కోనారి అప్పారావు, జేసీఎస్ కన్వీనర్ కామోదుల శ్రీనివాసరావు, ఎంపీడీఓ బాసూరి శంకరరావు, పలుశాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలి



మెయిన్‌రోడ్డు ర్యాలీ చేస్తున్న హిందూ, ముస్లిం, క్రైస్తవ సోదరులు

బాడంగి: మణిపూర్‌లో గత కొన్ని నెలలుగా జరుగుతున్న మారణ హోమాన్ని అడ్డుకోవాలని, ఆ రాష్ట్రంలో శాంతి స్థాపనకు కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని క్రైస్తవ, ముస్లిం సోదరులు కోరారు. ఈ మేరకు స్థానిక హైస్కూల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు బుధవారం శాంతియుత ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవహారంగా ఏర్పడి మణిపూర్ మారణకాండను ముగించాలి, మైనార్టీలకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. ర్యాలీలో ఫాదర్‌లు శామ్యూల్, చిన్నారావు, డేనియల్, ముస్లిం మతగురువు ఇస్లామ్, సీఐటీయూ నాయకులు పి.శంకరరావు, సురేష్ పాల్గొన్నారు.

ఎంపీడీఓకు సన్మానం



తెర్లాం: ఎంపీడీఓ రామకృష్ణను సన్మానిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

తెర్లాం: డిప్యూటీ సీఎం, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బూడి ముత్యాలనాయుడు, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి చేతుల మీదుగా జిల్లా ఉత్తమ ఎంపీడీఓగా అవార్డు అందుకున్న శంబంగి రామకృష్ణకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం సిబ్బంది, పలువురు ప్రజాప్రతినిధులు బుధవారం ఘనంగా సన్మానించారు. మండలాన్ని ప్రగతి పథంలో నిలిపేందుకు ఆయన అందిస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం ఎంపీడీఓ రామకృష్ణ మాట్లాడుతూ.. మండలంలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సహకారంతోనే తనకు ఈ అవార్డు వచ్చిందన్నారు. మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు మరింత కృషిచేస్తానన్నారు.

ఎస్ఈబీ సీఐకి అభినందనల వెల్లువ

రాజాం సిటీ: వరుసగా ఏడుసార్లు ఉత్తమ అధికారిగా అవార్డు అందుకున్న ఎస్ఈబీ సీఐ బి.శ్రీధర్‌ను కార్యాలయ సిబ్బంది అభినందించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చేతులు మీదుగా అవార్డు అందుకున్న సీఐని రాజాంలోని ఎస్ఈబీ కార్యాలయంలో బుధవారం సత్కరించారు. కార్యక్రమంలో ఎస్సై ఎస్.పిచ్చేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ మంత్రి వాసిరెడ్డికి నివాళి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి తదితరులు

బొబ్బిలి: మాజీ మంత్రి వాసిరెడ్డి కృష్ణమూర్తినాయుడు 101వ జయంతి సందర్భంగా స్థానిక రైల్వే స్టేషన్ జంక్షన్‌లో ఉన్న వాసిరెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో నిరుపేదలకు ఆయన చేతులమీదుగా దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంబంగి మాజీ మంత్రి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు ఇంటి గోపాలరావు, శంబంగి వేణుగోపాలనాయుడు, కొప్పలవెలమ సంఘ నాయకులు కర్రి సత్యనారాయణ, వాసిరెడ్డి కుమారుడు తాతాజీ, మున్సిపల్ కౌన్సిలర్ మరిపి తిరుపతిరావు, కోఆప్షన్ సభ్యుడు తెర్లి సత్యారావు, తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశిత లక్ష్యాలు చేరుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శంకరరావు

రాజాం సిటీ: జగనన్న కాలనీల్లో నిర్మిస్తున్న సోక్ పిట్స్(ఇంకుడు గుంతలు) పనులు త్వరగా చేపట్టాలని ఎంపీడీఓ బాసూరి శంకరరావు అన్నారు. స్థానిక కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే హౌసింగ్ అధికారులు గుర్తించిన ప్రదేశాల్లో హౌసింగ్ 90 రోజులు కార్యక్రమంలో భాగంగా ఇంకుడుగుంతలు నిర్మాణం పూర్తిచేయాలన్నారు. అలాగే ప్లాంటేషన్, ఐహెచ్‌హెచ్ఎల్ఎస్‌లను కూడా పూర్తిచేసి నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ కె.సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

చేయి చేయి కలిపారు.. సాగునీరు తెచ్చుకున్నారు



బాడంగి: పాల్తేరు ఛానల్‌లో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న భీమవరం రైతులు

బాడంగి: సాగునీటి కాలువల్లో పిచ్చిమొక్కలు పెరిగి నీటిసరఫరాకు అడ్డంకిగా మారడంతో రైతులు శ్రమదానం చేసి పూడికలు తొలగించారు. మండలంలోని భీమవరం గ్రామ గ్రామానికి చెందిన రైతులు బొబ్బిలి మండలం రొంపిల్లివలస సమీపంలో వేగావతినది వద్ద పారాధి ఆనకట్టు నుంచి పారాది మీదుగా గొల్లాది వరకు పాల్తేరు ఛానల్‌లో గత రెండురోజులుగా పూడికలు, పిచ్చిమొక్కలు తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. సుమారు 100 మంది రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామ సంఘం నిధుల నుంచి సుమారు లక్ష రూపాయల వరకు ఖర్చు అయినట్లు చెప్పారు. ఈ కాలువ గుండా నీరు అందితే గొల్లాదితో పాటు భీమవరం గ్రామంలో ఖరీఫ్ దమ్ములు పూర్తచేసి నాట్లు వేసేందుకు వీలుంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రేగిడి: మద్దువలస ఉపకాలువ 18ఎల్ ఆఫ్ 10ఆర్ పూర్తిగా పిచ్చిమొక్కలతో నిండిపోవడంతో సాగునీరు అందక రైతులు ఇబ్బంది పడుతున్నారు. అయితే అధికారులు వచ్చి బాగుచేస్తారులే అని ఎదురు చూడకుండా రైతులే స్వచ్ఛందంగా ముందుకువచ్చి కాలువలో పూడికలు, పిచ్చిమొక్కలు తొలగించారు. చాటాయవలస, వండానపేట సర్పంచ్‌లు కరణం గోవిందరావు, వియ్యపు చక్రపాణిల ఆధ్వర్యంలో ఉప్పరనాయుడువలస, చాటాయవలస, వండానపేట గ్రామాలకు చెందిన సుమారు 200 మంది రైతులు బుధవారం కాలువలో పిచ్చిమొక్కలు తొలగించి పంట పొలాలకు సాగునీటిని తెచ్చుకున్నారు.

గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు



బొబ్బిలి: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ నాగేశ్వరరావు

బొబ్బిలి: పంచాయతీల్లో ఖాళీ ఏర్పడ్డ స్థానాల్లో ఈనెల 19న ఉపఎన్నికలు ఉన్నందున పోలింగ్ జరిగే ప్రాంతాల్లో అల్లర్లు, గొడవలు సృష్టించేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే కఠిన చర్యలు, కేసులు తప్పవని సీఐ ఎం.నాగేశ్వరరావు హెచ్చరించారు. కొండదేవుపల్లిలో 2వ వార్డు స్థానానికి ఈనెల 19న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో సీఐ నాగేశ్వరరావు బుధవారం ఆ గ్రామానికి వెళ్లి స్థానిక ప్రజలు, నాయకులతో మాట్లాడారు. గొడవలు సృష్టించేందుకు ప్రయత్నించే వారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తామన్నారు. పోలింగ్ సజావుగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కాగా, మండలంలోని కారాడలో రెండు వార్డులు, శివడవలస ఒక వార్డు ఖాళీ ఏర్పడినప్పటికీ ఈ మూడు వార్డులూ ఏకగ్రీవం అయ్యాయి. కొండదేవుపల్లి స్థానానికి పోలింగ్ అనివార్యమైంది.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

వంగర: మండలంలోని లక్ష్మీపేట, ఓని అగ్రహారం గ్రామాల్లో జరగనున్న పంచాయతీ సర్పంచ్ ఉప ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలను ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు బుధవారం పరిశీలించారు. కేంద్రాల్లో బూత్‌ల ఏర్పాటు, వసతులపై ఆరాతీశారు. ఆయన వెంట ఏఓ లోపింటి త్రినాథ్, సచివాలయ కార్యదర్శి ఉన్నారు.

నేడు పిండ్రంగివలసలో 'గడపగడపకు..'

బాడంగి: మండలంలోని పిండ్రంగివలసలో గురువారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల జేసీఎస్ కన్వీనర్ మరిపి శంకరరావు తెలిపారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మండల స్థాయి అధికారులు పాల్గొనాలని కోరారు.

భోజన పొట్లాల పంపిణీ



అనాథలకు ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్న హరనాథరావు

రాజాం: పట్టణంలో మల్లికార్జునకాలనీలోని అనాథ వృద్ధాశ్రమంలో వృద్ధులకు, పొగిరి లెప్రసీ ఆస్పత్రిలో రోగులకు మొగిలివలసకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత మజ్జి హరనాథరావు బుధవారం భోజన పొట్లాలు పంపిణీ చేశారు. మజ్జి గణేష్ వర్ధంతి సందర్భంగా వీటిని పంపిణీ చేసినట్లు హరనాథ్ తెలిపారు. మరోవైపు గణేష్ స్నేహితులు రాజాం పట్టణంలోని అనాథలకు, పేదలకు టిఫిన్ పొట్లాలు, పండ్లు పంచిపెట్టారు.

ముళ్లపొదల తొలగింపు

రాజాం: మండలంలో పొగిరి రోడ్డులో మొగిలివలస వద్ద ప్రధాన రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన ముళ్లపొదలను బుధవారం స్థానిక యువత తొలగించారు. ముళ్లపొదలు పెరిగిపోవడంతో రోడ్డుపై ఎదురుగా వస్తున్న వాహనాలను సకాలంలో గుర్తించలేకపోవడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని నివారించేందుకు జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టామని యువత తెలిపారు.

రైతులు ఇబ్బంది పడకూడదు: ఏడీఏ

రాజాం: ఎరువుల కోసం రైతులు ఇబ్బంది పడకుండా చూడాల్సిన బాధ్యత ఎరువుల వ్యాపారులపై ఉందని వ్యవసాయశాఖ ఏడీఏ కె.చంద్రరావు అన్నారు. రాజాం వ్యవసాయశాఖ కార్యాలయం వద్ద రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాలకు చెందిన ఎరువులు, పురుగు మందులు, విత్తనాల వ్యాపారాలతో బుధవారం సమీక్ష నిర్వహించారు. అధిక ధరలకు ఎరువులు విక్రయించరాదని సూచించారు. ఈ ఖరీఫ్‌లో ప్రభుత్వంతో పాటు మనం కూడా రైతుకు అండగా ఉండాలన్నారు. అనంతరం ఉత్తమ వ్యవసాయశాఖ ఉద్యోగులుగా అవార్డులు పొందిన ఏడీఏ కె.చంద్రరావు, రాజాం వ్యవసాయశాఖ అధికారి ఎ.రేణుకాసాయిని వ్యాపారులు, ఆర్బీకే సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాజాం సబ్‌డివిజన్ ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ సీడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గారపాటి శ్రీనివాసరావు, పలువురు అసోసియేషన్ సభ్యులు, డీలర్లు పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారినంటూ ఉంగరం కాజేత

రాజాం సిటీ:

విజిలెన్స్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్నానంటూ గుర్తు తెలియని వ్యక్తి ఓ వ్యాపారి నుంచి బంగారు ఉంగరం కాజేసిన ఘటనపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దీనికి సంబంధించి టౌన్ సీఐ కె.రవికుమార్ తెలిపిన వివరాలు ప్రకారం.. స్థానిక అమ్మవారి కాలనీ 2వ లైన్‌లో నివాసం ఉంటున్న పాతింటి ఏకాంబరం కొండంపేట జంక్షన్ వద్ద పాన్‌షాపు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 15న రాత్రి 9.30 గంటల సమయంలో ఎప్పటిలాగే పాన్‌షాపు మూసేసి ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో కిరాణా సామాన్లు కొనుగోలు చేసుకొని తిరుగు పయనమయ్యాడు. ఇది గమనించిన గుర్తు తెలియని వ్యక్తి ఏకాంబరం ద్విచక్రవాహనాన్ని అనుసరిస్తూ వెళ్లి అతన్ని పిలవడంతో సెంటాన్స్ ఆస్పత్రి సమీపంలో ఏకాంబరం వాహనాన్ని ఆపాడు. తాను విజిలెన్స్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్నానని, నీ సామాన్లు తనిఖీ చేయాలని చెప్పాడు. సంచిలోని లేస్ ప్యాకెట్లను తనిఖీ చేస్తున్నట్లుగా చూసి ఏకాంబరం కుడిచేతిని నులిమివేసి వేలికి ఉన్న అరతులం బంగారం ఉంగరం లాక్కుని ఉడాయించాడు. వెంబడించినప్పటికీ ఫలితం లేకపోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

● డీఎంహెచ్ఓ ఎస్.భాస్కరరావు



సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు

రేగిడి: పీహెచ్‌సీల్లో విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని, విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కరరావు అన్నారు. మండలంలోని గుళ్లపాడు గ్రామంలో బుధవారం ఆయన పర్యటించారు. రెండురోజుల క్రితం గ్రామానికి చెందిన గుండాల ఈశ్వరమ్మ సెరిబ్రల్ మలేరియాతో మృతి చెందినట్లు అందిన సమాచారం మేరకు గ్రామాన్ని సందర్శించి మృతురాలి కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. గ్రామంలో మరో ముగ్గురు జ్వరాలతో బాధపడుతున్నట్లు గుర్తించారు. గ్రామంలో ఆరు వారాల పాటు వైద్య శిబిరం నిర్వహించాలని, ఈ గ్రామంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ఫీవర్ సర్వే చేయాలని, జ్వరాలపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మలేరియా నియంత్రణ అధికారి మణి, రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అసిరినాయుడు ఉన్నారు.

చిన్నారులకు సకాలంలో టీకాలు వేయాలి

రాజాం సిటీ: ఐదు సంవత్సరాలలోపు చిన్నారులందరికీ వ్యాధి నిరోధక టీకాలు క్రమం తప్పకుండా వేయాలని డీఎంహెచ్ఓ ఎస్.భాస్కరరావు అన్నారు. మండలంలోని గురవాం గ్రామంలో జరుగుతున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ప్రతీ చిన్నారికి టీకాలు బాధ్యతగా వేయాలని సిబ్బందికి సూచించారు. అంగన్‌వాడీల్లో చిన్నారుల బరువు క్రమం తప్పకుండా తూచి వారికి అవసరమైన వ్యాక్సిన్‌ను అందించాలన్నారు. అనంతరం గురవాం అనుబంధ గ్రామమైన పరశురాంపేటలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట పొగిరి పీహెచ్‌సీ వైద్యుడు బీవీ సత్యప్రకాష్, సిబ్బంది ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో అభిషేకాలు



పూజలు చేస్తున్న భక్తులు

రేగిడి: మండలంలో అంబఖండి గ్రామంలో వెలసిన అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రేజేటి సత్యనారాయణమూర్తి శర్మ, వంశీ శర్మ ఆధ్వర్యంలో రుత్వీకులు పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అంబఖండితో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



పేద విద్యార్థులకు సైకిళ్లు అందిస్తున్న సేవా సమితి సభ్యులు

రేగిడి: మండలంలో పనసలవలస గ్రామానికి చెందిన సేవా సమితి యూత్ సభ్యులు బుధవారం విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. పనసలవలస జెడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న నలుగురు పేద విద్యార్థులకు రూ.30 వేల విలువచేసే సైకిళ్లను బుధవారం అందజేశారు. అలాగే చదువుల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహాలు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బి.సునీత, జిల్లా యువజన నాయకులు కడగల నాగరాజు, గ్రామపెద్దలు పోలినాయుడు, గోవిందరావు, నర్సునాయుడు, శంకరరావు, డబ్బాడ సాయి, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

వన్నలిలో వైద్యశిబిరం



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ సోహిణీ రాఘవ్

రేగిడి: మండలంలోని వన్నలి గ్రామంలో బుధవారం 104 ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సోహిణీ రాఘవ్ ప్రజలకు ఆరోగ్య తనిఖీలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. వర్షాకాలంలో ప్రబలే వ్యాధులపై అవగాహన కల్పించడంతో పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ప్రియ, ఏఎన్ఎం రాజేశ్వరి, ఆశావర్కర్ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ



ప్రార్థనలో పాల్గొన్న ఎంఈఓ త్రినాథరావు

తెర్లాం: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ జె.త్రినాథరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం ప్రార్థనా సమయానికి పాఠశాలకు చేరుకొని విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. పాఠశాలలో మరుగుదొడ్ల నిర్వహణ, జగనన్న గోరుముద్ద పథకం, పాఠశాల రికార్డులు, విద్యార్థులతో వర్కుబుక్స్ రాయిస్తున్నదీ, లేనిదీ తనిఖీ చేశారు. జగనన్న గోరుముద్ద పథకాన్ని ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు పెట్టేలా చూడాలన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యా బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

బదిలీ ఉపాధ్యాయులకు సత్కారం

సంతకవిటి: మండలంలోని మందరాడ జెడ్పీ హైస్కూల్ పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన హెచ్ఎం దాసరి కృష్ణారావు, ఆంగ్ల ఉపాధ్యాయుడు అదపాక దామోదరరావుతో పాటు మరో తొమ్మిది మంది ఉపాధ్యాయులను బుధవారం సత్కరించారు. హైస్కూల్ ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రవిశంకర్, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొని బదిలీ ఉపాధ్యాయులకు ఘనంగా వీడ్కోలు పలికారు.



బదిలీ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న పాఠశాల సిబ్బంది

ఈ-క్రాప్ నమోదుతో ప్రయోజనాలు



నాయిరాలవలసలో ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏఓ మురళీకృష్ణ

రేగిడి: రైతులు సాగుచేస్తున్న పంటల వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ సూచించారు. మండలంలోని నాయిరాలవలస, లచ్చనవలస, జాడాపేట తదితర గ్రామాల్లో బుధవారం ఈ-క్రాప్ నమోదు వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. ఆయా గ్రామాల్లో ఈ-క్రాప్ నమోదును పరిశీలించారు. వీఆర్ఓలు అందించిన సర్వే నెంబర్ల ప్రకారం ఈ నమోదు చేసుకోవాలన్నారు. మండలంలో 2700 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు పూర్తయినట్లు చెప్పారు.

జోరుగా ఈక్రాప్ నమోదు

బొబ్బిలి: మండలంలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేస్తున్న పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేయాలని వ్యవసాయాధికారి మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. మండలంలో ఇప్పటివరకు 3,980 ఎకరాల్లో వరినాట్లు పూర్తయ్యాయని, అందులో 2,955 ఎకరాలకు సంబంధించి ఈ-క్రాప్ నమోదు పూర్తయిందన్నారు. ఉభాలు పూర్తయ్యే నాటికి అన్ని గ్రామాల్లో ఈ-క్రాప్‌ను పూర్తిచేస్తామన్నారు.